క్లుప్తంగా

ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోష్ తెలిపారు. శాయంపేట మండలంల పత్తిపాకకు చెందిన ఎండి.సోయెల్ తన అత్తమ్మను తీసుకొని బైక్‌పై ఈనెల 17న పెద్దాపూర్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో తిరుమలగిరి సమీపంలో బైక్‌ను వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు. ఆదివారం ఈ సంఘటనపై ఫిర్యాదు చేయగా సీఐ సంతోష్ ట్రాక్టర్ డ్రైవర్ అరికెల్ల రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రె చోరీ

దామెర : మండల కేంద్రంలో గొర్రె చోరీ జరిగిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వంగ సంపత్ తన గొర్లను తీసుకొని గ్రామ పొలిమేరలోని శ్రీహర్ష పాఠశాల సమీపంలో మేపుతున్నాడు. కాగా ఈ సమయంలో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి ఒక గొర్రెను ఆటోలో వేసుకొని అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోయారు. ఈ విషయమై సంపత్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సైని కలిసిన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు



శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామ అభివృద్ధి కమిటీ ఆదివారం ఎస్సై ప్రమోద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. గ్రామ అభివృద్ధి కమిటీ చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలకై సహకారాన్ని అందించాలని ఎస్సైని కోరారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం మంచి కార్యక్రమాలు చేస్తూ యువతకు మార్గదర్శంగా నిలుస్తూ అభివృద్ధి కోసం చేసే స్వచ్ఛంద కార్యక్రమాల్లో ఎల్లవేళలా మా సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ కన్వీనకర్, కో కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి



వేలేరు : పోలీస్ అమరవీరుల త్యాగాలు మరవలేనివని ఎస్సై ఏ.సురేశ్ అన్నారు. ఆదివారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో అమరవీరులకు నివాళులర్పించి వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు కీలకమని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



ఐనవోలు: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో మండల విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సోమవారం పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ రోజుల్లో యువతపై డ్రగ్స్‌పై, సైబర్ యొక్క ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు పెట్టామన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన ముగ్గురు విజేతలకు సోమవారం సాయంత్రం నగదు ప్రోత్సాహకం అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాగేశ్వర్‌రావుకు సన్మానం

విద్యారణ్యపురి: ప్రముఖ కళాకారుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, వనప్రేమి సంఘ సేవకుడు డాక్టర్ వల్లపట్ల నాగేశ్వర్‌రావు జన్మదిన వేడుకలను హనుమకొండ టీచర్స్‌కాలనీలోని ఆయన నివాసంలో వల్లంపట్ల డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ బాధ్యులు, కళాకారులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ బాధ్యులు, కళాకారులు నల్లమారి రమేష్, మేకల సూరయ్య, శ్యాంసుందర్, పద్మ పాల్గొన్నారు.

ప్రారంభమైన వరి కోతలు

- హార్వెస్టర్‌తో మొదలు పెట్టిన రైతులు
- ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కోసిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో పోస్తున్న హార్వెస్టర్

ఎల్కతుర్తి: ఖరీఫ్ సీజన్‌లో ఆటుపోట్లను తట్టుకుంటూ పంటలు సాగుచేసిన రైతులు వరికోతలు ప్రారంభించారు. పంట ఏపుగా పెరగడంతో పాటు సాగు చేసిన వరిపంట మంచిగా ఉండడంతో దిగుబడిపై కోటి ఆశలు పెట్టుకున్నారు. వ్యవసాయ బావుల్లో నీరు ఉన్న రైతులు సీజన్ ఆరంభంలోనే పంట సాగు చేయగా ప్రస్తుతం అవి కోతదశకు చేరుకున్నాయి. మరో వైపు వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల వల్ల వర్షాలు కురిసినట్లైతే చేతికందొచ్చిన పంట నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ముందస్తుగా హార్వెస్టర్లతో కోతలు మొదలు పెట్టారు.

15.616 ఎకరాల్లో వరిపంట సాగు

మండల వ్యాప్తంగా ఈ వర్షాకాలం సీజన్‌లో మొత్తం 15వేల 616 ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. ఇందులో 12 వేల ఎకరాలు సన్నరకాలు సాగుచేయగా మిగతా దొడ్డు రకం పంటను సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఎల్కతుర్తి, సూరారం, దండేపల్లి, వల్బాపూర్, వీరనారాయణపూర్ గ్రామాల్లో వరికోతలు ప్రారంభించారు. మిగతా గ్రామాల్లో మరో పది రోజుల్లో కోతలు చేపట్టే అవకాశం ఉంది. సన్నరకం వరికి కొంత తెగుళ్లు ఆశించడంతో వరిపైర్లకు మందులు పిచికారీ చేశారు. దీంతో రైతులపై కొంత అదనపు పెట్టుబడి భారం పడింది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే రూ.500 బోనస్ ప్రకటించడంతో రైతులకు కాస్త ఊరట లభించినట్లైంది. సన్నరకాలు ఎకరానికి 22 నుంచి 24 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు సూచనా (అంచన) ప్రాయంగా వెల్లడించారు. అదేవిధంగా దొడ్డురకం వరి ఎకరానికి 25 నుంచి 26 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. మూడు వేల ఎకరాలకు 78 వేల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ముందుగా వేసిన వరిపంట కోత దశలో ఉండగా కాస్త వెనుక వేసిన వరిపంట ఈని ఇప్పుడిప్పుడే ఎండుదశకు చేరుకుంటున్నాయి. కోత కోసిన ధాన్యాన్ని రైతులు నేరుగా రైస్ మిల్లులకు తరలిస్తుండగా కొంత మంది రైతులు ఐకేపీ సెంటర్లకు తరలించి ధాన్యాన్ని ఆరబెట్టే పనిలో పడ్డారు. మరో వారంలోగా వరికోతలు మండల వ్యాప్తంగా ఊపందుకోనున్నాయి.



ఎల్కతుర్తి మండలం వీరనారాయణపూర్‌లో కోత దశకు చేరుకున్న వరిపంట



రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

వరిధాన్యం కొనుగోలు కేంద్రం

ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇటీవలే ప్రారంభించా రు. మరో వారంలోగా కోతలు ఊపందుకో నున్న క్రమంలో మిగతా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నడికూడ : రాజవ్వ చిత్రపటం నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి



ఐనవోలు : చందర్‌రావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్

నడికూడ: మండలంలోని వరికోల్ గ్రామానికి చెందిన పిట్ట రాజయ్య, బొల్ల నర్సమ్మ, అల్లె బాలరాజ్, రాసమల్ల లక్ష్మి, పరిష కొమురయ్య, చర్లపల్లికి చెందిన గట్టు రాజయ్య, దావు రాజవ్వ, శ్రీలం సమ్మక్క, పంతంగి రాములు, ఏదులాపురం శేఖరయ్య ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మృతుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం నింపారు. ధర్మారెడ్డి వెంట మండల, గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు జైపాల్ రెడ్డి, రవీందర్, గణపతి రెడ్డి ఉన్నారు.

ఐనవోలు : నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్‌రావు పెద్దకోడలు శ్వేత(45) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఆదివారం శ్వేత చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. చందర్‌రావును, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అరూరి వెంట మజ్జిగ జైపాల్, ఉస్మాన్ అలీ, సదానందం, తంపుల మోహన్, పిడుగు రజిత ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

ధర్మసాగర్: మిత్రుడి కుటుంబానికి తనతో పాటు చదువుకున్న తోటి మిత్రులు అండగా నిలిచారు. కలిసి చదువుకున్న మిత్రుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబానికి తోటి విద్యార్థులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని నారాయణగిరి గ్రామానికి చెందిన పోలెపల్లి కరుణాకర్ భవన నిర్మాణ రంగంలో కార్మికుడిగా పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. కరుణాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ క్రమంలో నారాయణగిరి ప్రభుత్వ పాఠశాలలో కరుణాకర్‌తో కలిసి చదువుకున్న చిన్ననాటి మిత్రులు ఆయన కుటుంబానికి రూ.40 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు సదానందం, కుమారస్వామి, లక్ష్మణ్, సత్యనారాయణ, యాదగిరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

ఎత్తు తక్కువ ఉన్న స్తంభాల తొలగింపు

- 7 గంటల పైన విద్యుత్ అంతరాయం
- ఇబ్బందులు పడిన గ్రామస్తులు



నూతన స్తంభాన్ని బిగిస్తున్న సిబ్బంది

శాయంపేట : స్థానిక మార్కండేయ స్వామి ఆలయం నుంచి బీసీ కాలనీ వరకు ఆదివారం ఎత్తు తక్కువ ఉన్న 9 పాత స్తంభాలను తొలగించి కొత్తవి విద్యుత్ ఏఈ చందూలాల్ ఆధ్వర్యంలో అమర్చారు. విద్యుత్ స్తంభాల పునరుద్ధరణలో భాగంగా మండల కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడంతో గ్రామస్తులు ఆదివారం కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రక్కన ప్రమాదకరంగా ఉన్న పాత స్తంభాలను తొలగించి 9.1 మీటర్ ఎత్తు ఉన్న హై టెన్షన్, లో టెన్షన్ విద్యుత్ స్తంభాలను అమర్చి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇంతేకాకుండా ప్రమాదకరంగా ఉన్న రెండు విద్యుత్ స్తంభాలను కూడా తొలగించామని తెలిపారు. ఆయనతో జూనియర్ లైన్‌మెన్ విష్ణు, కాంట్రాక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

కిరాయి మనుషులతో బీఆర్‌ఎస్ ఆందోళనలు

పరకాల: రైతు సంక్షేమం కోసం కోసం పాటుపడుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ఈర్షతో బడా భూస్వాములకు మేలు జరిగే విధంగా హడావుడిగా కిరాయి మనుషులతో రైతు భరోసా కోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతుల పక్షపాతి అన్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేకనే బీఆర్‌ఎస్ పార్టీ కిరాయి మనుషులతో ఆందోళన కార్యక్రమాలు చేయిస్తు అనవసర రాద్ధాంతం సృష్టిస్తుందన్నారు. భవిష్యత్‌లో బీఆర్‌ఎస్‌కు మరోసారి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్, కట్కూరి దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఒంటేరు రాంమూర్తి, కాంగ్రెస్ నాయకులు చిన్నాల గోనాథ్, కొలుగూరి రాజేశ్వర్‌రావు, ఎం.డీ అలీ, బొమ్మకంటి చంద్రమౌళి, దాసరి భిక్షపతి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్



తిరుపతిరెడ్డి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

దామెర: బీఆర్‌ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని దుర్గంపేట్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు చిల్ల తిరుపతి గత జూన్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కాగా బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ద్వారా ప్రమాద బీమా వర్తింపజేయగా రూ.2 లక్షలు మంజూరయ్యాయి. కాగా చెక్కును తిరుపతి కుటుంబ సభ్యులకు ఆదివారం ధర్మారెడ్డి తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలు అకాల మరణం చెందితే పార్టీ తరపున ఆర్థికసాయం అందించి వారి కుటుంబలకు ఆర్థిక తోడ్పాటును అందించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గండు రాము, మాజీ వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, రఘుపతి రెడ్డి, దాడి మల్లయ్య, నేరెళ్ల కమలాకర్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దామెర: మండలంలోని పులుకుర్తిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990–91 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులందరూ ఆదివారం పాఠశాల ఆవరణలో సమావేశం ఏర్పాటు చేశారు. 33 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులందరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం వారికి విద్యాబుద్దులు నేర్పిన గురువులకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ జిల్లా డిప్యూటీ విద్యాధికారి కుసుమ సర్వేశం పాల్గొని మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని సూచించారు. సమావేశానికి డాక్టర్ కె. సదానందం అధ్యక్షత వహించగా ఉపాధ్యాయులు సీహెచ్ సదానందం, పి.రాజిరెడ్డి, కె. కుమారస్వామి, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



వేలేరు : అంబేడ్కర్ సెంటర్ వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



కమలాపూర్ : ధర్నా, రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



ఐనవోలు : రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

రైతు భరోసా ఎగవేతపై నిరసనలు



పరకాల : పరకాలలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పరకాల: మోసపూరిత మాటలతో రేవంత్‌రెడ్డి సర్కార్ తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని పరకాల వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ బండి సారంగపాణి అన్నారు. బీఆర్‌ఎస్ హయంలోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యపడిందన్నారు. కాంగ్రెస్ రైతు భరోసా ఎగవేతపై బీఆర్‌ఎస్ పార్టీ పిలుపు మేరకు పరకాల బస్టాండ్ కూడలిలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ప్రభుత్వం వ్యతిరేఖ విధానాలు వీడాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు దుంపేటి నాగరాజు, శనిగరపు నవీన్, గొర్రె రాజు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

వేలేరు : మండలంలోని రైతాంగానికి సాగునీరు రాకపోతే ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇంటి ఎదుట టెంట్ వేసుకుని దీక్ష చేస్తానని మాజీ జెడ్పీటీసీ చాడ సరిత హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మండల పార్టీ అధ్యక్షుడు మరిజె నర్సింగరావు ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. మండల కోఆర్డినేటర్ సురేష్, మాజీ వైస్ ఎంపీపీ సంపత్, వీరయ్య, జానీ, భూపతిరాజ్, జ్యోతి, సంపత్, తిరుపతి పాల్గొన్నారు.

కమలాపూర్ : రైతులకు వానాకాలం రైతు భరోసా వెంటనే విడుదల చేయాలని, రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎర్రం ఇంద్రసేనారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమలాపూర్ బస్టాండ్ కూడలిలో రైతులతో కలిసి బీఆర్‌ఎస్ శ్రేణులు ఆదివారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు అంకతి సాంబయ్య, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి సంపత్‌రావు, రామస్వామి, వెంకటేశ్వర్లు, అశోక్, రాజు, శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా ఎగవేసే ప్రయత్నంపై ఆదివారం నిరసన కార్యక్రమాలు వెల్లువెత్తాయి. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు అంబేడ్కర్ చౌక్‌వద్ద నిరసన వ్యక్తం చేసి అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్, సురేందర్, సింగిల్‌విండో చైర్మన్ రవిందర్ గౌడ్, శేషగిరి, సంపత్, మహేందర్, ఎల్తూరి స్వామి, తంగెడ నగేష్, పాల్గొన్నారు.

శాయంపేట : రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వెంటనే రైతు భరోసా ఇచ్చి ఆదుకోవాలని మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులతో నిరసన తెలిపారు.

ఐనవోలు : రైతులకు వానాకాలం పంటకు ఇస్తానన్న రూ.7500 భరోసా నిధులు ఎందుకు ఇవ్వడం లేదని బీఆర్‌ఎస్ మండల నాయకుడు తంపుల మోహన్ ప్రశ్నించారు. ఆదివారం పున్నేలు క్రాస్ వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సదానందం, ఉస్మాన్‌అలీ, రాజు, సోమేశ్వర్‌రావు, శ్రీరామోజు సతీష్, అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తిలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



శాయంపేట : నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



ముల్కనూరులో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


26న ఎమ్మార్పీఎస్ బహిరంగ సభ

హసన్‌పర్తి: వరంగల్ జిల్లాలో ఈనెల 26న ఎమ్మార్పీఎస్ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ఎంఎస్పీ జాతీయ నాయకుడు ఆరెపల్లి పవన్‌కుమార్ తెలిపారు. హసన్‌పర్తిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతారని పేర్కొన్నారు.

పింగిళి కళాశాలలో నేటినుంచి జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాలలో హిందీ, సంస్కృత విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21, 22వ తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి, సదస్సు కన్వీనర్లు మమత, రాజేశ్వరి ఆదివారం తెలిపారు. ఏ స్టడీ ఆఫ్ ఉమెన్ క్యారెక్టర్ ఇన్ రామాయణ అండ్ ఇట్స్ రిలవెన్స్ ఇన్ మోడ్రన్ ఎరా (రామాయణంలో స్త్రీ పాత్రల అధ్యయనం, వర్తమాన కాలంలో నాటి ఔచిత్యం) అనే అంశంపై రెండు రోజులపాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా వరంగల్ అడిషనల్ డీసీపీ సంజీవ్ పాల్గొంటారని, కేయూ హిందీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సీహెచ్.సంజీవ్ కీలకోపన్యాసం చేస్తారు.

ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న భోగేశ్వర్

ఖిలా వరంగల్: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని టీపీడీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం జరిగిన పర్వతగిరి మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రావాల్సిన ఐదు పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్, అశోక్, మల్లికార్జున్, భిక్షపతి, వెంకటేశ్వర్లు, రమేష్, భదావత్ రాజు, కమలాకర్, సురేష్‌బాబు, ప్రసాద్ పాల్గొన్నారు.